

నేటి నుంచే ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్

- 16న కళాశాలల్లో సీట్ల ఎలాట్‌మెంట్
- ముందస్తు కౌన్సెలింగ్‌తో సీట్లు పెరిగే అవకాశం

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 30 : ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ఈనెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించుకోవాలి. 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యార్థుల సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసుకోవాలి. 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కళాశాల ఎంపిక నమోదు చేసుకోవాలి. 13వ తేదీన కళాశాలలు మార్పు చేసుకొనే అవకాశం ఉంటుంది. 16వ తేదీన కళాశాలలో సీట్లు ఎలాట్‌మెంట్ చేస్తారు. 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కళాశాలలో విద్యార్థులు రిపోర్టింగ్ చేసుకోవాలి. ఈనెల 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

కావాల్సిన సర్టిఫికెట్స్

ఇంజనీరింగ్ చేరే విద్యార్థులు సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పదో తరగతి మార్కుల లిస్టు, ఇంటర్మీడియట్ మెమో, ఇంటర్మీడియట్ టీసీ, 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. వీటితో పాటు ఏపీఈఏపీ సెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు జత పరచాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, అర్హులైన ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, లేదా ఒరిజినల్ రేషన్ కార్డును అప్‌లోడ్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.600 చెల్లించాలి. సర్టిఫికెట్ల అప్‌లోడ్‌లో విద్యార్థులకు ఏదైనా సందేహాలుంటే తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

సీట్లు పెరిగే అవకాశం

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ గతేడాది కంటే నెల ముందుగానే జరుగుతున్నది. దీంతో కళాశాలలో సీట్లు భర్తీ పెరిగే అవకాశం కనిపిస్తున్నది. డిగ్రీ అడ్మిషన్‌లు ఇంకా జరగలేదు. అందువల్ల ఇంజనీరింగ్ పైనే విద్యార్థులు దృష్టి ఉండవచ్చునే అంచనా వేయవచ్చు. దానికి తోడు ఈ ఏడాది ఏపీ ఈఏపీ సెట్‌లో 11,718 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లాలోని 15 ఇంజనీరింగ్ కళాశాలలో గత ఏడాది లెక్క ప్రకారం 12,030 సీట్లలో 3,609 మేనేజ్‌మెంట్ సీట్లుకు పోగా 8,421 కన్వీనర్ సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మరో వెయ్యి సీట్లు పెరిగే అవకాశం ఉంది.

ఊరూ వాడా ఆనందం



పింఛన్‌ల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో పెంచిన పింఛన్ మొత్తాన్ని తీసుకోవాలని ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జూలై 1వ తేదీన అట్టహాసంగా గత మూడు నెలలు ఎరియర్స్‌తో కలిపి మొత్తం రూ.7వేల పింఛన్ అందజేసే రోజు రానే వచ్చింది. సోమవారం ఉదయం వారందరికీ ఈ పింఛన్ మొత్తాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజే నూరుశాతం పంపిణీ చేయాలని నిర్దేశించుకున్నారు.

నేడు ఎరియర్స్‌తో కలిపి పింఛన్ల పంపిణీ

- ఉదయం 6 గంటల నుంచే ప్రారంభం
- జిల్లాలో 2.68 మంది లక్షల లబ్ధిదారులకు రూ.182.73 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు
- తొలిరోజే నూరుశాతం అందించే లక్ష్యం
- పెన్షన్ లబ్ధిదారుల్లో ఆనందం
- కూటమి నాయకులు, కార్యకర్తల్లోనూ జోష్

ఏలూరు సిటీ , జూన్ 30 : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలులో భాగంగా పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచగా ఏప్రిల్ నుంచే పెంచిన మొత్తాలను అందిస్తానని వాగ్దానం చేశారు. అందులో భాగంగా అవ్వా తాతలకు ఎరియర్స్‌తో కలిపి రూ.7వేల పింఛన్ మొత్తాన్ని అందజేయడానికి ఇప్పటికే గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటలకే నుంచే పింఛన్లు అందజేస్తారు. లబ్ధిదారులకు తొలిసారిగా రసీదును, సీఎం సందేశానికి సంబంధించిన ఒక పత్రాన్ని అందజేస్తారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఉదయం 6గంటలకు నూజివీడు రూరల్ మండలంలోని పోతురెడ్డిపల్లిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో అన్ని పింఛన్లు కలిపి మొత్తం 2,68,353 మంది లబ్ధిదారు లున్నారు. వారందరికీ పెంచిన పింఛన్ మొత్తం 182 కోట్ల 73 లక్షల 92వేల 500 రూపాయలను పంపిణీ చేయనున్నారు.

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం
అభయహస్తం	4747	23,73,500
డప్పు కళాకారులు	2081	1,45,67,000
విభిన్న ప్రతిభావంతులు	33915	20,34,90,000
మత్స్యకారులు	6312	4,41,84,000
కళాకారుల పెన్షన్	174	12,18,000
వృద్ధాప్య	134473	94,13,11,000
సైనిక్‌వెల్ఫేర్	18	90,000
సింగిల్ ఉమెన్	8342	5,83,94,000
తలసేమియా	74	7,40,000
కల్లుగీత కార్మికులు	4621	3,23,47,000
చర్మకారులు	1704	1,19,28,000
ట్రాన్స్‌జెండర్	73	5,11,000
నేత కార్మికులు	1151	80,57,000
వితంతు	68284	47,79,88,000
సీకేడీయూ (ప్రభుత్వ)	191	19,10,000
సీకేడీయూ (ప్రైవేటు)	269	26,90,000
డీఎంహెచ్‌వో	1914	2,55,44,000
అమరావతి లాండ్‌లెస్‌పూర్	10	50,000
మొత్తం	268353	1,82,73,92,500

సచివాలయ ఉద్యోగులతో పంపిణీ

జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులతో ఈ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క సిబ్బంది 50 మందికి పింఛన్‌లు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 4,539 మంది సచివాలయ సిబ్బందితో పాటు 826 మంది వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. పెన్షన్ మొత్తాలను ఇప్పటికే ఆయా అధికారులకు అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో పెన్షన్ పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పండుగలా పింఛన్ల పంపిణీ..

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జూన్ 30 : పండుగ వాతావరణంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం అమల్లో భాగంగా వృద్ధాప్య పింఛన్‌లను జూలై మాసానికి రూ.4 వేలు, గత మూడు నెలల బకాయి రూ.3వేలను కలిపి మొత్తం రూ.7వేల అందించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 2.68 లక్షల మంది లబ్ధిదారులకు 182.73 కోట్ల పింఛన్ల సొమ్ము పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో మండల, గ్రామ పార్టీ నాయకులు, టీడీపీ అభిమానులు సమన్వయంతో సచివాలయం ఉద్యోగులతో కలిపి ఉదయం 6 గంటలకు అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేసి వారి కళ్ళల్లో ఆనందాన్ని నింపాలని ఈ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కాగా నూజివీడు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం మంత్రి పార్థసారథి పాల్గొంటున్నారు. ఉదయం 6 గంటలకు నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో, ఉదయం 7.30 నిమిషాలకు నూజివీడు పట్టణం గాంధీనగర్‌లో, 10 గంటలకు ఆగిరిపల్లిలో మంత్రి పాల్గొని పింఛన్‌లను పంపిణీ చేయనున్నారు.



వీసీలో మాట్లాడుతున్న ఏఎస్పీ స్వరూపరాణి

నేటి నుంచి కొత్త చట్టాల అమలు

- అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, జూన్ 30 : నేటి ఆధునిక ప్రపంచానికి అనుకూలమైన చట్టాలను రూపకల్పన చేసి శాసన సంబంధమైన ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలను అమలు చేయాలని జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి అన్నారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో వీడియో కాన్ఫరెన్సును ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ 1860 నుంచి భారత దేశంలో అమలులో ఉన్నటువంటి చట్టాలకు బదులుగా నేటి ఆధునిక పరిస్థితుల అనుకూలమైన చట్టాలు రూప కల్పన చేశారన్నారు. భారతీయ న్యాయ సన్నిహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత (బీఎన్ ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్యాభినయం (బీఎస్‌ఏ)లను అమలు చేయాలని తెలిపారు. పోలీసు అధికారులకు ఏదైనా సహాయ సహకారాలు కావాలంటే ఎస్పీ ఆదేశాలపై సబ్ డివిజన్ స్థాయిలో న్యాయ సహాయకులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ మూడు చట్టాలపై ఆన్‌లైన్‌లో అధికారులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించినట్టు తెలిపారు. ఎన్‌పీఆర్‌బీ ద్వారా సంకలన్ అనే యాప్ ఆన్‌లైన్‌లో ఉందని ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.బ్రహ్మయ్య, డీటీ సీడీ ఎస్పీ కె.ప్రభాకర రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ కె.గోపాలకృష్ణ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఇన్‌చార్జి ఏపీసీగా డీఈవో నియామకం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 30 : సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ(ఇన్‌చార్జి)గా డీఈవో అబ్రహంను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఏపీసీగా పనిచేసిన బి.సోమశేఖర్ ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ మేరకు తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. కొద్దిరోజుల్లోనే రెగ్యులర్ ఏపీసీని నియమించనున్నారు. కాగా ఇన్‌చార్జి ఏపీసీగా నియమితులయ్యేందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌ఎస్‌ఏ ఏపీసీగా వున్న శ్యాంసుందర్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు రెగ్యులర్ ఏపీసీని నియమించాల్సిందిగా డీఈవో ఇప్పటికే ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

నేటి నుంచి ‘సాల్ట్’ శిక్షణ

- వాయిదాకు ఏపీటీఎఫ్ డిమాండ్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 30 : తరగతి గదిలో విద్యార్థుల దృక్పథం, ఉపాధ్యాయుల ప్రవర్తనలో మార్పు.. ప్రధాన లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ‘సాల్ట్’ (సపోర్టింగ్ ది ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్)ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సోమవారం నుంచి 9రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో 398 మంది హైస్కూల్ హెచ్‌ఎంలు, సీనియర్ టీచర్లకు జంగారెడ్డిగూడెం, ఏలూరు, కైకలూరు, భీమడోలు, నూజివీడులలో గుర్తించిన పాఠశాలల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. తరగతి గదిలో విలువలు పడిపోతున్న నేపథ్యంలో బోధించే సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రవర్తనా విధానంలో మార్పులు తీసుకురావడానికి కొత్త కరికులం రూపకల్పనలో ఈ పరిశాలనాంశాలను పరిగణనలోకి తీసుకోవడానికి దీనిని ఉద్దేశించారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ‘సాల్ట్’ను డిజైన్ చేశారు. శిక్షణలో భాగంగా తొలివిడతలో తరగతి గదిలో బోధించే సమయంలో విద్యార్థుల దృక్పథం, ఉపాధ్యాయుడి ప్రవర్తనను హెచ్‌ఎం/సీనియర్ టీచర్ గమనించడం ద్వారా సంబంధిత యాప్‌లో నిర్ధీత 90 ప్రశ్నలకు పరిశీలనాంశాలను అప్‌లోడ్ చేస్తారు. ప్రస్తుతం శిక్షణ పొందే హెచ్‌ఎం/సీనియర్ టీచర్లే జిల్లాలోని అన్ని పాఠశాలలను సందర్శించి యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కాగా విద్యాసంవత్సరం ప్రారంభమై ప్రస్తుతం నూతన అడ్మిషన్లు, విద్యాప్రవేశం, నేను బడికి పోతా.. తదితర కార్యక్రమాలతో పాటు, పలు బోధనా కార్యక్రమాలు జరుగుతున్న వేళ టీచర్లను శిక్షణ పేరుతో పది రోజుల పాటు పాఠశాలలకు దూరం చేయడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర అభ్యంతరం వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమం వల్ల విద్యార్థులపై ప్రభావం పడుతుందని, రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

పోలవరం..ఇక పరుగులు

- ప్రాజెక్టును పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం
- ఇంజనీరింగ్ అధికారుల్లో కొత్త ఉత్సాహం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న విదేశీ నిపుణుల బృందం

పోలవరం, జూన్ 30 : పోలవరం ప్రాజెక్టులో అమెరికా, కెనడా దేశాలకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ రంగ నిపుణుల పర్యటనతో ఆదివారం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందిలో కొత్త ఉత్సాహం ఉరకలేసింది. గత ఐదేళ్లుగా పడకేసిన పోలవరం ప్రాజెక్టు పనులు ఇటీవల నూతన ప్రభుత్వ పాలన ప్రారంభం నుంచి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పోలవరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం కేంద్రం ప్రభుత్వానికి ప్రాజెక్టు పరిస్థితులపై నివేదికలు పంపిన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు అథార్టీ నియమించిన విదేశీ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంది. విదేశీ నిపుణుల బృందంలో అమెరికాలో ప్రాజెక్టు నిర్మాణ రంగంలో నిపుణులైన జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్, కెనడాకి చెందిన సీన్ హించ్ బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ఉన్నారు. ఈ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టులో ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రాజెక్టు పరిశీలనా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ బృందం ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణంలో సమస్యాత్మక ప్రాంతాలైన ఎగువ కాఫర్, దిగువ కాఫర్ డ్యాంల నిర్మాణం, సీపేజీ తదితర అంశా లపై సుమారు 6 గంటల పాటు క్షేత్ర స్థాయిలో సుదీర్ఘ పరిశీలన చేసి సంబంధిత వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద భూగర్భం నుంచి బోర్ డిగ్గింగ్ ద్వారా సేకరించిన మట్టి నమూనాలను బృంద సభ్యులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కాఫర్ డ్యాంల నిర్మాణ దశలను పరిశీలించారు. పలు సమస్యల పట్ల కూలంకషంగా వివరాలు విదేశీ నిపుణుల బృందం ఇంజనీర్లను అడిగి తెలుసుకు న్నారు. విదేశీ నిపుణుల బృందానికి సీడబ్ల్యుసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్ కుమార్, ప్రాజెక్టు సలహాదారు ఎం.వెంకటే శ్వరరావు, సంబంధిత వివరాలను తెలిపారు. సోమ వారం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్, పీజియో మీటర్ గ్యాప్ 2 ప్రాంతా లను ఈ బృందం పరిశీలించనున్నట్లు ఎస్‌ఈ తెలిపారు. పోల వరం ప్రాజెక్టు అథార్టీ ప్లానింగ్ అండ్ డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ రాజేష్ కుమార్, వ్యాప్కోస్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కే పట్నాయక్, ఈఈ లు మల్లికార్జున రావు, ప్రేమ్ చంద్, పాండురంగయ్య, శ్రీనివాసరావు తదితరులు బృందం వెంట ఉన్నారు.



ఎగువ కాఫర్ డ్యాం ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం ఎస్‌ఈ నరసింహ మూర్తి



విదేశీ నిపుణుల బృందం సేకరించిన మట్టి నమూనాలు



చేప పిల్లలను దిగుమతి చేసుకుంటున్న రైతులు

చేప పిల్లలకు.. గిరాకీ

- రొయ్య నుంచి చేపల సాగు వైపు రైతులు
- చెన్నై, నెల్లూరు నుంచి చేపల సీడ్

కలిదిండి, జూన్ 30 : చేప పిల్లకు గిరాకీ పెరిగింది. రొయ్యల సాగులో కష్టాలు పెరగడంతో చాలామంది రైతులు ప్రస్తుతం వాణిజ్య పరంగా ఎక్కువ డిమాండ్ ఉన్న శీలావతి రకానికి డిమాండ్ పెరిగింది. దీంతో కట్ల, ఫంగస్, బొచ్చు వంటి రకాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. శీలావతి రకం అంగుళం సైజు చేప పిల్ల 130 పైసలు ధర ఉంది. మండలంలో 25 వేల ఎకరాల్లో చేపలు సాగు చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రొయ్య కంటే చేపల మేలని భావిస్తున్నారు. చేపల సీడ్ హేచరీలు మన ప్రాంతంలో పరిమితంగా ఉన్నాయి. ఇక్కడ రైతులకు అవసరమైన సీడ్ చెన్నై, నెల్లూరు కొంత కాకినాడ, ప్రకాశం జిల్లాల నుంచి తీసుకువస్తారు. బాగా చిన్న సైజు చేప పిల్లను తీసుకొచ్చి స్థానిక హేచరీలో పెంచుతారు. నెల రోజుల్లో ఎదిగిన సైజును రైతులకు విక్రయిస్తారు. ప్రస్తుతం శీలావతి చేపల పిల్ల అంగులం సైజు 130 పైసలు పలుకుతోంది. ఇంకా పెద్ద సైజు ఉంటే రూ.2 నుంచి రూ.5 ధర ఉంది. ఎకరాకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు చేప పిల్లలు వేస్తున్నారు. కొంతమంది నాణ్యత ప్రమాణాలను అనుసరించి చేప పిల్లలను చెరువుల్లో వేస్తుంటారు. రొయ్యతో పోలిస్తే చేప జీవన ప్రమాణం ఎక్కువ వైరస్, ఇతర వ్యాధులు కూడా తక్కువే.

శీలావతి, కట్ల, ఫంగస్‌కు డిమాండ్

వాణిజ్య పరంగా శీలావతి, కట్ల తర్వాత ఫంగస్‌కు డిమాండ్ ఉంది. బొచ్చు, రూప్‌చంద్ వంటి రకాలు కూడా సాగు చేస్తారు. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో రైతులు చేప పిల్లల కొనుగోలు ముమ్మరం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని చిన్న చెరువుల్లో పెంచి తిరిగి పెద్ద చెరువుల్లో వదులుతున్నారు.

జోరు తగ్గని వర్షాలు

ఏలూరు సిటీ, జూన్ 30 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి రోజురోజుకు బలపడుతోంది. ఈ కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీగానే వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాలో పిడుగులు, ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్ళే కూలీలు, రైతులు, పశువుల కాపరులు వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండరాదని, రక్షిత ప్రదేశాల్లోనే ఉండాలని చెబుతున్నారు. వర్షాల రాకతో సార్వా పనులు ఊపందుకున్నాయి. ఏలూరు నగరంతో పాటు పెదవేగి, నూజివీడు, కుక్కునూరు, కలిదిండి, ముదినేపల్లి, దెందులూరు, వేలేరుపాడు, ముసునూరు, చింతలపూడి, మండవల్లి, కైకలూరు, నిడమర్రు, టినరసాపురం, ఆగిరిపల్లి, బుట్టాయిగూడెం, చాట్రాయి జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీల నీరు రహదారుల పైకి చేరడంతో ఆయా ప్రాంతాల్లో దుర్గం ధం నెలకొంది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పెదవేగి మండలంలో 95.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 39.9 మి.మీ నమోదైంది. కుక్కునూరు 56.4, కలిదిండి 56.4, ముదినేపల్లిలో 55.6, నూజివీడులో 48.6, దెందులూరులో 48.2, వేలేరుపాడులో 48, ముసునూరులో 48, చింతలపూడి 47.6, మండవల్లి 43.2, కైకలూరు 41.6, నిడమర్రు 40.6, టి.నరసాపురం 40.2, ఆగిరిపల్లి 40.2, ఉంగుటూరు 38.8, బుట్టాయిగూడెం 38.6, చాట్రాయి 38.6, జంగారెడ్డిగూడెంలో 34.6, కామవరపుకోట 31.4, లింగపాలెం 31.4, ఏలూరు రూరల్ 30.4, పెదపాడు 27.6, కొయ్యలగూడెం 27.4, భీమడోలు 25.6, ఏలూరు అర్బన్ 24.6, ద్వారకా తిరుమల 23, పోలవరం 20, జీలుగుమిల్లి 13.8 మి.మీ వర్షపాతం నమోదైంది.



మండవల్లిలో ప్రాథమిక పాఠశాల-1 ఆవరణలోకి చేరిన వర్షం నీరు

జోరుగా సార్వా సాగు

అల్పపీడన ద్రోణి కారణంగా కురుస్తున్న వర్షాలతో సార్వా పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో సార్వా వరి సాగు 2.30 లక్షల ఎకరాల్లో జరగాల్సి ఉండగా దానికి సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు వరి నారుమళ్లు 4వేల 500 ఎకరాల్లో పూర్తి చేశారు. వరి నాట్లు జిల్లాలో ఇప్పటి వరకు 2వేల 700 ఎకరాల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వరి నారుమళ్ల పనులు, వరి నాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

పోలవరానికి జగనే శాపం

- చంద్రబాబుతోనే ప్రాజెక్టు సాకారం
- ఇకనైనా అసత్యాలు మానుకోవాలి : ఎంపీ పుట్టా

న్యూఢిల్లీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ‘పోలవరానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డే శాపంగా మారారు. జగన్ స్వార్థంతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పనుల్లో జాప్యం జరిగింది. పోలవరంపై చంద్రబాబుకు ఉన్న అవగాహన ఎవరికీ లేదు. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడం చంద్రబాబు ఒక్కరి వల్లే సాధ్యం’ అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ‘పోలవరం గురించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలిపేందుకే చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రాజెక్టు చంద్రబాబు హయాంలో 72 శాతం పూర్తవ్వగా గత ఐదేళ్లలో జగన్ చేసిన పని కేవలం 3.84 శాతం మాత్రమే. జగన్ స్వార్థం కోసం 72 శాతం పనులను సమర్థవంతంగా చేసిన కాంట్రాక్టర్‌ను మార్చేశారు. అప్పర్ కాఫర్ డ్యామ్ పనులు చివరి దశలో ఉన్నప్పుడు రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చగా, కొత్త కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో తాత్సారం చేశారు. దీంతో 2020లో వరద పోటుకు గురై తీరని నష్టం జరిగింది. జగన్ ఎందుకు కాంట్రాక్టర్‌ను మార్చారు? ఏమైనా కమీషన్లు తీసుకున్నారా? అనేదానిపై సమగ్ర విచారణ జరుగుతుంది. జగన్ నిర్లక్ష్యంతో ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. నిర్వాసితులను కూడా జగన్ పట్టించుకోలేదు. గత ఇరిగేషన్ మంత్రి కనీసం తనకు అర్థమే కాలేదని చెబుతున్నారు. జగన్ మీడియాకు కూడా ప్రాజెక్టుపై అవగాహన లేదు. ఇకనైనా అసత్యాలు ప్రచారం చేయడం మానుకుని అభివృద్ధి సాగనివ్వాలి’ అని పుట్టా హితవు పలికారు.

సచివాలయాలపై చెరగని జగన్ ముద్ర

▸ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వలేదని అధికారుల స్పష్టత



కోరుమిల్లి సచివాలయంపై జగన్ ముద్ర

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30 : కూటమి ప్రభుత్వం కొలువై నెలరోజులు గడుస్తున్నా జిల్లాలో సచివాలయాలపై జగన్ ముద్ర చెరగడంలేదు. నవరత్నాల పేరుతో జగన్ చిత్రపటంతోపాటు నవరత్నాలు చిత్రాలు ఉండేట్లు సచివాలయాలపై ఏకంగా టైల్స్‌తో అంటించేశారు. ఎన్నికల కోడ్ సమయంలో వాటిపై క్లాత్‌తో కప్పి ఉంచారు. వాటిని నేటికీ కొన్ని చోట్ల మాత్రమే క్లాత్‌తో కప్పి ఉంచారు. 90 శాతం పైగా సచివాలయాలపై నేటికీ ఆ నవరత్నాలు దర్శనమిస్తున్నాయి. అంటే జిల్లా పంచాయతీ అధికారులకు గత ప్రభుత్వంపై ఉన్న భక్తి ఇంకా తగ్గలేదని అందుకనే ఈ నవరత్నాల బోర్డులపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వడంలేదంటూ కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి రోళ్లకంటి విక్టర్‌ను వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..


1914 నాటి ప్రధాన రాజగోపురం


ప్రస్తుతం ఇరువైపులా కార్యాలయాలు, పాదుకా మండపంతో ప్రధాన రాజగోపురం మెట్ల దారి

ద్వారకాతిరుమల, జూన్ 30: దాదాపు 110 సంవత్సరాల క్రితం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన రాజగోపురం ఈవిధంగా ఉంది. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శతాబ్దాల నాటి చరిత్ర కల్గిన క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పేరు గాంచింది. 1914లో ఉన్న ఆలయ దక్షిణ గోపురానికి ఇప్పటి గోపురానికి మధ్య చాలా అభివృద్ధి కన్పించింది. గతంలో ఆలయ గోపురాల పక్కన కొండలు, వృక్షాలతో ఉండేదని కాలక్రమేణా వచ్చిన అధికారులు పరిసరాలను అభివృద్ధి చేశారు. గతంలో తూర్పుగోపురం పక్కన అంతా కొండతోనూ చెట్లతో చిట్టడవిని తలపించేదిట. అప్పటి ఈవో ఎంఎస్‌రావు దానిని తొలగింపజేసి దారిని ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం భక్తులకు సౌకర్యంగా ఉంది. ప్రధాన రాజగోపుర మెట్ల దారి సైతం ప్రస్తుతం ఇరువైపులా ఆలయ కార్యాలయం, పద్మావతి, ఆండాళ్ సదనాలను నిర్మించారు. మెట్లకు ఇరువైపులా దశావతార చరిత్రతో విగ్రహాలు, మెట్ల దిగువన పాదుకా మండపాన్ని సైతం నిర్మించారు.

నెరవేరనున్న అయోధ్యలంక వాసుల కల

▸ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పితాని ఆదేశం


2014లో శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఇదే..

ఆచంట, జూన్ 30 : ఆచంట మండలం అయోధ్య లంక ప్రజల చిరకాల స్వప్నం త్వరలోనే నెరవేరనుంది. 2014లో అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ అయోధ్యలంక-పుచ్చల్లంక గ్రామాలను కలుపుతూ వశిష్ఠ గోదావరి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటిలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాల విలువ రూ.50కోట్లుగా నిర్ధారించారు. పదేళ్లుగా బ్రిడ్జికి సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో శిలాఫలకం మాత్రమే దర్శనమిస్తుంది. ఇప్పటివరకు లంక వాసుల కల నెరవేర లేదు. మళ్లీ పితాని ఆచంట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ బ్రిడ్జితోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను అనుసంధానం చేస్తూ కోడేరు నుంచి పి.గన్నవరం, నేషనల్ హైవే కనెక్టివిటీకి సంబంధించి దీనిపై గతంలో ఆయన చంద్రబాబుతో చర్చించారు. ఇది కూడా చేపట్టాలని ఎమ్మెల్యే పట్టుదలతో ఉన్నారు. పలు అభివృద్ధి పనులపై సమీక్షలు చేస్తుండడంతో నియోజక వర్గ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏ ఒక్కరూ తీసుకునే నిర్ణయం కాదు

▸ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసవర్మ దంపతుల పూజలు

భీమవరం టౌన్, జూన్ 30 :విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏ ఒక్కరూ నిర్ణయం తీసుకునే వ్యవహారం కాదని గతంలోని మోదీ అధికారంలోకి రాకముందే ఒక పాలసీపరంగా తీసుకున్న నిర్ణయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది ఒక్క విశాఖ ఉక్కుకు సంబంధించి విషయం కాదన్నారు. డీ ఇన్వెస్మెంట్ ప్రక్రియలో భాగంగా విశాఖ స్టీల్ ప్లాంట్ దానిలోకి రావడం జరిగిందన్నారు. ఏ విధంగా విశాఖ ఉక్కును రక్షించుకునే అవకాశం ఉంది అనేది ప్రధాని మోదీతో మాట్లాడి ఆయన నిర్ణయాన్ని బట్టి భవిష్యత్తు నిర్ణయం ఉంటుందన్నారు. దీనిపై కేంద్రంలో ఉన్న పెద్దలను, ఉన్నతాధికారులను కలసి మాట్లాడడం జరిగిందన్నారు.

సోమేశ్వరస్వామికి శ్రీనివాసవర్మ దంపతుల పూజలు

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, వెంకటేశ్వరదేవి దంపతు లు పంచారామ క్షేత్రమైన భీమవరం సోమేశ్వర, జనార్దనస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

మన్‌కీ బాత్ మంచి కార్యక్రమం..

దేశ ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్ కార్యక్రమం'లో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలను చైతన్యం వంతులను చేయడంతో పాటు ఆలోచింపచేసే అనేక విషయాలను ప్రస్తావించి దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. భీమవరం అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, కలిదిండి వినోద్‌కుమార్‌వర్మ, షేక్ మొహిద్దీన్, రాయప్రోలు రాజశేఖర్ పాల్గొన్నారు

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

▸ మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు రూరల్, జూన్ 30 : గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుని పెన్షన్ సొమ్మును అందజేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ సొమ్ము పెంపు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అని, మానవతా వాది చంద్రబాబునాయుడు అని, జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేయడమే కాకుండా రూ.12 లక్షల కోట్లు అప్పు పెట్టినప్పటికీ పేదలకిచ్చిన మాట మేరకు పెంచిన పెన్షన్ సొమ్ముతో పాటు మూడు నెలల బకాయి సొమ్ము కలసి రూ.7 వేలు సోమవారం నుంచి అందిస్తామన్నారు. పాలకొల్లు నియోజక వర్గంలో గతంలో రూ.8.79 కోట్లు కాగా ప్రస్తుత పెన్షన్ సొమ్ము పెంచడంతో రూ.20 కోట్లకు పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, ఎంపీడీవో అనుపమ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 1,538 కేసుల పరిష్కారం



ఏలూరు క్రైం, జూన్ 30 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 1,538 కేసులు పరిష్కరించామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. జూన్ 29వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని జిల్లా వ్యాప్తంగా బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రమాద బీమా కేసులలో 8 కోట్ల రూపాయలపైగా పరిహారం కింద చెల్లించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌తో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఇతర అధికారులందరికీ ఆయనతో పాటు జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పల్లా శ్రీనివాస్‌కు లక్ష్మీరాణి అభినందన



కైకలూరు, జూన్ 30: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏలూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అభినందించారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్ల అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆయన సూచించినట్లు లక్ష్మీరాణి తెలిపారు.



కనువిందు..

కలిదిండి మండలం పోతుమర్రు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు పసుపు రంగు పూలతో విరబూసి ప్రజలను ఆకట్టుకుంటోంది. ఆకులు కూడా కనపడకుండా పూలు విరబూసి కనువిందు చేస్తోంది. యువత ఇక్కడ సెల్ఫీలు దిగుతోంది.

-కలిదిండి

ప్రజాపాలనకు రాజ్యాంగ పీఠికే గీటురాయి


తణుకులో 'దారి దీపం' పుస్తకావిష్కరణ దృశ్యం

తణుకు, జూన్ 30: రాజ్యాంగ పీఠిక పాలకుల ఆచరణకు, ప్రచారాలకు గీటురాయి కావాలని.. అందుకు పౌర సమాజం గళం విప్పాలని ప్రముఖ సాహితీవేత్త డీవీవీఎస్ వర్మ అన్నారు. ఆదివారం తణుకు సురాజ్య భవనంలో 'రాజ్యాంగ పీఠిక-ప్రజాపాలనకు దారిదీపం, బహుళ సంస్కృతిపై హిందుత్వ దాడి-ప్రత్యామ్నాయాలు' అనే రెండు అంశాలపై సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పీఠిక చిన్నదిగా కనిపించినా అది మాత్రం రాజ్యాంగంలోని అంతస్సారాన్ని వ్యక్తీకరిస్తుందని, దేశంలో అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను, మత విశ్వాస స్వేచ్ఛను, అందరికీ అవకాశాల సమానత్వాన్ని ప్రకటిస్తూ జాతీయ ఐక్యతను, సమగ్రతను ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పీఠిక దేశ ప్రజలకు వాగ్దానం చేసిందని, నిజమైన ప్రజాపాలన అంటే రాజ్యాంగ పీఠికను అమలు చేయడమేనన్నారు. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక పరిచయ కార్యక్రమాలను విద్యాసంస్థల సహకారంతో విద్యార్థుల భాగస్వామ్యంతో పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించాలని కోరారు. రాజ్యాంగంపై మతతత్వ దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రెండో సదస్సుకు ప్రముఖ జర్నలిస్టు మందలపల్లి కిషోర్ అధ్యక్షత వహించగా కె.శాంతారావు, డాక్టర్ స్టాలిన్, విశ్రాంత న్యాయాధికారి లక్ష్మీ, హైమవతి, వావిలాల సరళాదేవి చర్చలో పాల్గొన్నారు. అనంతరం 'దారి దీపం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్మ పుట్టినరోజును పురస్కరించుకుని ఆత్మీయ సభకు ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ అధ్యక్షత వహించగా పలువురు మాట్లాడారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా చదువుకోవాలి

▸ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెనుగొండ, జూన్ 30 : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా చదువుకుంటే భవిష్యత్తు గొప్పగా ఉంటుందని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. ఆదివారం పెనుగొండలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వసతి గృహాన్ని, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీశారు. విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకునేలా పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. అన్ని విషయాలపై పూర్తి పరిజ్ఞానం కలిగినప్పుడే చదువులో కూడా మరింత రాణించగలరన్నారు. చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వసతి గృహంలో ఏదైనా సమస్య ఉంటే తెలపాలని విద్యార్థులను అడగగా తాగు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహ ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులకు వసతి కల్పించామని, 450 మంది వరకు కెపాసిటీ ఉందని, అడ్మిషన్స్ జరుగుతున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. 2+2 మహిళా సెక్యూరిటీ సిబ్బందిని 24 గంటలు గృహంలో ఏర్పాటు చేశామన్నారు. వసతి గృహం నిర్వహణపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు.

ఇంటిలో ఎవరూ లేరని గమనించి..

▸ రూ.3.70 లక్షల నగదు,10 కాసుల బంగారం
4 కేజీల వెండి వస్తువుల అపహరణ


ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు

జంగారెడ్డిగూడెం, జూన్ 30 : ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రధాన ద్వారం పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దోచుకెళ్లిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో శనివారం రాత్రి జరిగింది. లక్కవరం ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దోరేపల్లి లక్ష్మీనారాయణ ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి దుండగులు లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.3.70 లక్షల నగదు, పది కాసుల బంగారు ఆభరణాలు, 4 కేజీల వెండి వస్తువులు అపహరించారు. దోరేపల్లి లక్ష్మీనారాయణ కుమారుడు రామరాజు మాట్లాడుతూ తన తల్లి ఆసుపత్రి పని నిమిత్తం, తమ్ముడు, చెల్లెలు ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రి ఆసుపత్రి పని నిమిత్తం ఏలూరులో తన దగ్గర ఉంటున్నారన్నారు. ఐదు రోజులుగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చోరీ జరిగిన ఇంటికి ఏలూరు నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించిందని, చోరీపై రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి దోచేశారు

▸ 8 కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు అపహరణ

పెదపాడు, జూన్ 30 : ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని నగదు, డబ్బు తస్కరించిన ఘటన పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో నివాసముంటున్న మరడాని సోమేశ్వరరావు జూన్ 22వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి 30వ తేదీ ఆదివారం ఇంటికి వచ్చేసరికి ఇంటితాళాలు బద్దలు కొట్టిఉన్నాయి. దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు తస్కరించినట్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 30 : ఆన్‌లైన్ యాప్ ద్వారా పెట్టుబడి చేస్తే అధిక మొత్తం లాభాలు వస్తాయని వాట్సాప్‌లో ఒక లింకు రావడంతో దానిని నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ వ్యక్తి మోసపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన కాశిన సుధాకరరావు కాంట్రాక్టు వర్కులు చేస్తుంటాడు. అతడి వాట్సాప్‌లో జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ పేరుతో ఒక లింకు వచ్చింది. ఆ లింకుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తొలుత ఐదు వేల రూపాయలు పెట్టుబడిపెట్టగా అధిక లాభాలు ఇచ్చారు. దానిని నమ్మి మరికొంత సొమ్ము పెట్టుబడి పెట్టగా దానికి కూడా ఇచ్చారు. చివరకు 15 లక్షల 25 రూపాయలు పెట్టుబడి పెట్టగా వారి నుంచి ఎలాంటి సమాధానం లేదు. తమ కంపెనీ గుర్తింపు పొందిందేనని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని నమ్మబలికారని ఆ తరువాత సమాధానం చెప్పడం లేదంటూ వాపోయాడు. ఆదివారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ కంపెనీపై కేసు నమోదు చేశారు.

కోడి పందేలపై దాడి.. నలుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం, జూన్ 30:జంగారెడ్డిగూడెం పట్టణంలోని ముత్రాసుపేటలో జరుగుతున్న కోడి పందేలపై ఎస్‌ఐ జ్యోతిబసు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1050 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు.


నలుగురు జూదరుల అరెస్ట్

పాలకొల్లు రూరల్, జూన్ 30 : పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశామని పాలకొల్లు రూరల్ ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు. ఉల్లంపర్రు గ్రామ శివారు ప్రాంతంలో పేకాటాడుతున్నట్టు సమాచారంతో ఆదివారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1230 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాగి వైర్లు మాయం

▸ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో తొలగిస్తున్న వైనం
▸ ఆపై సొమ్ము చేసుకుంటున్న దొంగలు
▸ వరుస చోరీలతో రైతుల్లో ఆందోళన
▸ దర్భగూడెంలో శనివారం రాత్రి రాగి వైర్ల తస్కరణ


పి.రాజవరంలో రాగి వైర్లు తీసిన దృశ్యం




దర్భగూడెంలో రైతు వాసు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ అయిన దృశ్యం

జీలుగుమిల్లి, జూన్ 30 : రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్లు వరుస చోరీలకు గురవుతున్నాయి. దర్భగూడెంలో శనివారం రాత్రి డి.వాసుకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైరు చోరీ చేశారు. విద్యుత్ స్తంభానికి ఐరన్ స్టాండ్ ఏర్పాటు చేసి పైన ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్‌కు దొంగలు విద్యుత్తు సరఫరా రాకుండా వైర్లు కట్ చేసి కింద పడేసి దానిలో ఉండే రాగివైర్లను చాకచక్యంగా దొంగిలించి తరలిస్తున్నారు. ఆ రాగి వైర్లను గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేక్రమంలో రెండు రోజుల క్రితం పి.రాజవరంలో రైతు ప్రసాదరెడ్డి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరు దొంగిలించారు. పది రోజుల క్రితం బర్రింకలపాడులో ఓ గిరిజన రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పోయింది. జీలుగుమిల్లి సమీప గ్రామాల రైతులు రాత్రి సమయంలో సైతం పొలాల్లో మోటార్ల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసే సమయం దగ్గరపడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తేకాని వ్యవసాయ పనులు ముందుకు సాగవని రైతులు చెప్పటం గమనార్హం. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్తది ఏర్పాటు చేస్తే రూ.25 వేలు వరకు ఖర్చు అవుతుందంటున్నారు. బాధిత రైతులు, విద్యుత్ శాఖ అధికారులు కలసి పోలీసలకు ఫిర్యాదు చేయ్యాల్సి వస్తోంది. జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఏడీ కార్యాలయం ఏర్పాటు చేసినా, గత ఐదేళ్లుగా మండల ఎలక్ట్రికల్ ఏఈని నియమించలేదు. నేటి వరకు ఇన్‌చార్జి ఏఈ ద్వారా ఆ శాఖ ఉన్నత అధికారులు కాలం గడుపుతున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లు వరుస చోరీలకు పాల్పడే వారిపై పోలీసులు దృష్టిసారించాలని రైతులు చెబుతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరుచోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందగా.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మరో ముగ్గురు మృతి చెందారు.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూన్ 30 : నడిచి రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన ఘటన మండవల్లి మండలం చావలపాడు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లాకు పార్వతీపురానికి చెందిన చిలకా నాయుడు (50) కొంతకాలం నుంచి మండవల్లి మండలం చావలపాడులో ఒంటరిగా ఉంటూ చేపల చెరువులపై కూలి పనులకు వెళ్తున్నాడు. శనివారం రాత్రి గ్రామంలో నడిచి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కైకలూరు మండలం గుమ్మళ్ళపాడుకు చెందిన కొండపల్లి మహేందర్ తన మోటారు సైకిల్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే చిలకా నాయుడు మరణించాడని నిర్ధారించి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

ప్రేమికురాలు దక్కలేదని యువకుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూన్ 30 : తాను ప్రేమించిన యువతి దక్కలేదని.. మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భీమవరం రూరల్ రూరల్ హెచ్‌సీ మహేష్ తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం బేతపూడి గ్రామ పరిధిలోని యమునాపల్లి గ్రామానికి చెందిన బుంగా చందు(23) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతికి ఇటీవల నిశ్చితార్థం వేరే యువకుడితో కావడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి రెండు రోజులు క్రితం వెళ్ళిపోయాడు. దీనిపై భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. ఆదివారం మొగల్తూరు మండలం పాతపాడు గ్రామం వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లో ఒక మృతదేహం ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు పరిశీలించారు. బుంగా చందు మృతదేహంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

పోడూరు, జూన్ 30 : అనారోగ్య పరిస్థితి కారణంగా ఓ యువతి మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పోడూరు మండలం జిన్నూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. జిన్నూరు చాకిరేవు గుంటకు చెందిన గారపాటి సౌజన్య(22) కొంతకాలంగా మానసిక సమస్య, ఫిట్స్ వ్యాధితో బాధపడుతుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సమయంలో మనస్తాపానికి గురై తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్నయ్య రాజు పరిస్థితిని గమనించి పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. అన్నయ్య రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ డి.రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఏలూరు క్రైం, జూన్ 30 : ఏ కారణమో తెలియదు కాని ఒక యువకుడు పురుగుమందు తాగి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. పెనుగొండ మండలం దొంగరావిపాలెంనకు చెందిన తంగేటి వినాయకుడు(22)కు తండ్రి చిన్ననాడు మరణించగా తల్లి ఏడాది క్రితం మరణించింది. అతడి సోదరులు గల్ఫ్‌లో ఉంటున్నారు. వినాయకుడు హైదరాబాద్‌లో ఉంటూ టైల్స్‌పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామానికి వచ్చారు. ఏ కారణమో తెలియదు కాని శనివారం ఇంటి వద్ద ఉన్న అతడు పురుగుమందు తాగాడు. స్థానికులు గమనించి అతడిని తొలుత తణుకు ఆసుపత్రి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: రైలు ఢీకొన్న ప్రమాదంలో 45-50 ఏళ్ల వయస్సు మధ్య గల వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి చేబ్రోలు, పూళ్ల స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొట్టడం వల్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు వివరించారు. మృతుడు నలుపురంగుపై నీలం రంగు, తెలుపుతో చిన్న చిన్న గడుల లుంగీ, తెలుపురంగు టవల్ ధరించినట్టు వివరించారు. మృతదేహం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్ 94906 17090, 99480 10061 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టి కారు పల్టీ.. ఒకరి మృతి



కొవ్వూరులో కాలేజీ వద్ద ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) జోగినాథ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం/కొవ్వూరు, జూన్ 30: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం)లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్‌వీ జోగినాథ్(34) జూన్ 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వెళ్లాడు. షాపింగ్ పూర్తి చేసుకుని స్నేహితులతో కలిసి కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. ఈమేరకు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథ్‌కు తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. కాకినాడకు చెందిన జోగినాథ్. 2009లో ఉద్యోగం నిమిత్తం జంగారెడ్డిగూడెం వచ్చి తల్లిదండ్రులకు ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామసూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడు జోగినాథ్‌కు తల్లిదండ్రులతో పాటు వివాహాలైన ఇద్దరు అక్కలు ఉన్నారు. తమ కుమారు డికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి : కలెక్టర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 30 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం కలెక్టర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు లభించే సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షింపజేయాలని సూచించారు. ఎం.అచ్యుతరావు, నాగేంద్రసింగ్, అజాద్ తదితరులున్నారు.

జూలై 8 నుంచి మొహరం వేడుకలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీర్ల పంజా కమిటీ సభ్యులు

ఏలూరు కల్చరల్, జూన్ 30: కుల, మత, రాజకీయాలకు అతీతంగా సమైఖ్యతతో జూలై ఎనిమిది నుంచి 17 వరకు మొహరం పీర్ల పండగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పీర్ల పంజా కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్‌కే రాజాఅహ్మద్, ఇబ్రహీం బేగ్, అధ్యక్షుడు ఎండీ గాలబ్‌ఆలీ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఏడాది ఏలూరు నగరంలోని 11 మసీదుల్లో మొహరం పీర్ల వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీ వరకు ప్రత్యేక ప్రార్థనలు, ప్రజల క్షేమం కోసం, వారి ఆరోగ్యం కోసం అల్లాని ప్రార్థిస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాబా, రజాక్, బసార్‌తుల్లాబేగ్, సర్దార్, రహీంబాజీ, ఇక్బాల్, షబ్బీర్, అహ్మద్‌పాష, రహీమ్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు

లింగపాలెం, జూన్ 30: పెరిగిన పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాత్రమే దక్కుతుందని, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు అన్నారు. నరసన్నపాలెంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన విధంగా ఏప్రిల్ నుంచి పెరిగిన పింఛన్ అందజేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లిఖార్జున్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుత్తా సత్యసాయివర ప్రసాద్, మోరంపూడి రంగారావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, తాతిన రాధాకృష్ణ, కూరపాటి వెంకటేశ్వరరావు, మోరంపూడి ప్రసాద్, ఆసిలేటి అజయ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదవేగి, జూన్ 30 : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని పెదవేగి శాఖా గ్రంథాలయాధికారి తోట అరుణ్ కుమార్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథ పఠనం చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థిలో అంతర్లీనంగా ఉండే కళలు వెలికి వస్తాయన్నారు.

రాట్నాలమ్మ వారికి ప్రత్యేక పూజలు



పెదవేగి జూన్ 30 : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గ మాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.49,196లు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.38,235లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.5,080లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.9,500లు విరాళాలు అందించారని చెప్పారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు



ఏలూరు కార్పొరేషన్, జూన్ 30 : పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద జేష్ఠ మాసంలోని ఆఖరి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, గోత్రనామాలతో పూజలు జరిపారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. సూర్య నమస్కార పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో పూజలు చేయించారు. అలాగే నగరంలోని పలు డివిజన్లలో గల గ్రామదేవతలను భక్తులు కుటుంబ సమేతంగా దర్శించుకుని చలివేపారాలు, వేడిమి పారాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించు కున్నారు. కుంకుమార్చనలు నిర్వహించారు. నిమ్మకాయల దండలను అమ్మవారికి అలంకరించారు. కొత్తపేటలోని నూకాలమ్మ, గానుగులపేట, తూర్పువీధి, ఆదివారపు పేట, పత్తేబాద, పవరు పేటలలోని గంగానమ్మ అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు.

సోదెం వారి ఇలవేల్పులను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

బుట్టాయగూడెం, జూన్ 30 : మండలంలోని మెరకగూడెం గ్రామంలో వేంచేసిన సోదెం వారి ఇలవేల్పులను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని అధిక దిగుబడులు రావాలని, ప్రజలంతా అయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఇలవేల్పులను కోరుకున్నట్లు బాలరాజు తెలిపారు. పూజారి సోదెం సుధాకర్, నాయకులు, జి.నాగేశ్వరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

మా ఆస్తులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం సరికాదు

ఏలూరు రూరల్, జూన్ 30: స్థానిక 20వ డివిజన్‌లోని విజయ గార్డెన్స్ నివాసితుల ఆస్తులను బ్లాక్ లిస్ట్‌లో ఉంచి, ఇబ్బందులకు గురిచేయటం సరికాదని, విజయగార్డెన్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు డీఎల్ నరసింహరావు, ప్రధాన కార్యదర్శి కేవీఎస్‌పి శర్మ మాట్లాడుతూ మినీ బైపాస్‌కు దగ్గర్లో ఉన్న విజయ గార్డెన్స్ భూమి పూర్వం తూతా గోపాలరావుకు చెందినదని, లేఅవుట్ వేసి ప్లాట్లుగా అమ్మగా, తామంతా కొనుగోలు చేశామన్నారు. ఆస్తి, నీటి పన్నులు చెల్లిస్తూ వస్తున్నామన్నారు. తమ నివాస ప్రాంతాన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ తహసీల్దార్ సుబ్బారావు, శాంతకుమార్, డి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం

» నేడే పెంచిన పింఛను సొమ్ములు ఇంటింటా పంపిణీ » ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



దుగ్గిరాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని



రావికంపాడులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా

పెదవేగి, జూన్ 30 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిలో భాగంగా పింఛను సొమ్ము జూలైలో రూ. ఏడు వేలను అందించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో చింతమనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 36,776 మంది లబ్ధిదారులకు రూ.25 కోట్ల ఎనిమిది లక్షల తొమ్మిది వేల 500లను పంపిణీ చేయనున్నామని ఆయన వివరించారు. కూటమి నాయకులు పాల్గొని, లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందించాలని ఆయన సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చవటపల్లి విక్రమ్ కిషోర్, నియోజకవర్గ ఇంచార్జి చైతన్యకృష్ణ, జనసేన దెందులూరు ఇంచార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేష, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, మంచిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట :పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ జరగనుండడంతో రావికంపాడులో కూటమి నాయకుల సమక్షంలో ఆదివారం కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. మండలంలో 8,223 మందికి పింఛన్లు అందజేసేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. రావికంపాడు సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, జోలా విజయ్ పాల్గొన్నారు.

● పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి, సత్యవేణి తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 8,223 మందికి రూ. రెండు కోట్ల 44 లక్షల 88 వేలు అందజేస్తామని చెప్పారు. పింఛనుదారులు అందరూ ఇంటి వద్ద అందుబాటులో ఉండాలన్నారు.

● ఉంగుటూరు : బాదంపూడి, రాచూరుగొల్లగూడెం, చేబ్రోలు గ్రామాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొంటారు. అనంతరం చేబ్రోలు పీహెచ్‌సీలో డయేరియా వ్యాప్తి నిరోధానికి సంబంధించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు.

● చింతలపూడి : పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందేలా సహకరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

● దెందులూరు :పింఛన్ల పంపిణీని ఒక్క రోజులోనే పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో శ్రీలత తెలిపారు. మండలంలో 9,651 మందికి రూ. ఆరు కోట్ల 60 లక్షల 39 వేల 500లను సచివాలయ ఉద్యోగులతో కలిసి పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఇళ్లకే వెళ్లి అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు,

● బుట్టాయగూడెం :పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు పెంచిన వెయ్యి రూపాయలతోపాటు జూలై నెల రూ.నాలుగు వేలను వికలాంగులకు రూ.ఆరు వేలను అందిస్తున్నందున సచివాలయం ఉద్యోగులతో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందించాలని కోరారు.

● లింగపాలెం : పింఛన్ల పంపిణీని ఒక్క రోజులోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. మండలంలో ఉన్న 8,075 మంది పింఛనుదారులకు రూ.ఐదు కోట్ల 51 లక్షల 75 వేలను, 150 మంది సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామని, ప్రతి ఒక్కరు ఇంటి దగ్గరే ఉండాలని సూచించారు. స్థానిక నాయకులతో కలిసి పింఛనల్లు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూన్ 30: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తూర్పు వీధి బాలత్రిపుర సుందరి, సోమలింగేశ్వర దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం విద్యార్థులకు ఎమ్మెల్యే చంటి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర దేవాంగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యనందించేందుకు దేవాంగ సంక్షేమం సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శారద, ఇంటిలిజెన్స్ ఎస్సై వైవీ.రామ్మోహనరావు, కార్పొరేటర్లు పృథ్వీ శారద, ప్రవీణ్‌కుమార్, దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు సోమలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవల్లో మహిళలకు ప్రాధాన్యం



నూతన అధ్యక్షులతో మాజీ గవర్నర్ పంకజాక్షన్

చింతలపూడి, జూన్ 30: లయన్స్ క్లబ్ సేవల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం విశేషమని, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీకే పంక జాక్షన్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవన్‌లో చింతలపూడి, యర్రంపల్లి, ప్రగడవరం, టి.నరసాపురం, లయన్స్‌క్లబ్‌ల ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు కూడా సేవలు అందించడం శుభదాయకమని, మహిళలకు కావాల్సిన సేవలు విస్తృతం చేయవచ్చని అన్నారు. చింతలపూడి, యర్రంపల్లి, ప్రగడవరం, టి.నరసాపురం లయన్స్‌క్లబ్‌ల అధ్యక్షురాళ్లుగా విజయలక్ష్మి, జగ్గవరపు మాధవి, ముల్లంగి విలాసకుమారి, బాలస్వామి చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం లయన్స్ సేవలు అందించడంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. గతంలో చింతలపూడి క్లబ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సేవా కార్యక్రమాలు చేపట్టిందని, జిల్లా స్థాయిలో కూడా మంచి పేరు సాధించిందని పంకజాక్షన్ పేర్కొన్నారు. జీఎస్టీ కోఆర్డినేటర్ చిల్లపల్లి రామ్మోహన్‌రావు, జిల్లాగవర్నర్ కాకరాల వేణుబాబు, ఆర్సీలు యర్రంరాజు, రత్నకుమార్, జడ్‌సీలు వల్లి కృష్ణవేణి, ఎ.పవన్‌కుమార్, గోలిచంద్రశేఖర్ రెడ్డి, అబ్బయ్య, సుధాకర్, గాంధీ, పెద్దిన ప్రసాద్, చెన్నకేశవ రెడ్డి, వేమారెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సేవలు అందిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్ , జూన్ 30 : కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. స్థానిక 11వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. సోమవారం పింఛన్ల పంపిణీ ప్రక్రియలో కూటమి నాయకులు పాల్గొని పింఛన్‌దారులందరికి పింఛన్ అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన నాయకులు నారా శేషు, మహిళా నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, చోడే వెంకటరత్నం, కూనిశెట్టి మురళీకృష్ణ, నకల సాయిప్రసాద్, చోడే బాలసుబ్రహ్మణ్యం, గొల్ల హరికృష్ణ, మేకా సాయి, పొన్నగంటి భవాని తదితరులు పాల్గొన్నారు.

అప్పలనాయుడుకు మహిళా సంఘాల సత్కారం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించినందుకు ప్రముఖ పాత్ర వహించిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును మహిళా సంఘాలు ఆదివారం చెంచులకాలనీలోని ఆయన నివాస గృహం వద్ద ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు అప్పలనాయుడుకు ఆత్మీయ సత్కారం చేశారు.

ప్రజలిచ్చిన అధికారం ప్రజలకే అంకితం

పెదవేగి, జూన్ 30 : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజలకే ఈ అధికారాన్ని అంకితమిస్తున్నానని ఆయన చెప్పారు. దుగ్గిరాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెదపాడుకు చెందిన టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మనకు అధికారం ఇచ్చింది వారికేదో మంచి చేస్తారనే నమ్మకంతో అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తనను అత్యంత భారీ ఆధిక్యంతో గెలిపించారని, అలాంటి వారి నమ్మకానికి అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గడచిన ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, ఇకపై ప్రశాంతమైన గ్రామాలను చూస్తారని, కక్షలు, కార్పణ్యాలకు దూరంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానని ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, లావేటి శ్రీనివాస్, మోరు శ్రావణీ దశరథ్, గారపాటి రామసీత, గుత్తా అనిల్, ఎం.వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారాలు



ఎస్‌ఐ శేఖరరావును సన్మానిస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు క్రైం, జూన్ 30 : ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు ఎస్‌ఐలు, ఒక కానిస్టేబుల్‌ను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న సీహెచ్‌పీ శేఖరరావు, ఎస్‌ఐ ఎస్.రాధాకృష్ణారెడ్డి, వీఆర్‌ఎస్ పదవీ విరమణ చేసిన కానిస్టేబుల్ డి.చరణ్‌రాజ్‌లను ఆదివారం ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రసాదరాజు, బీఈ వెంకటేశ్వరరావు, రైటర్ ఎస్.రాజ్‌కుమార్, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఐఏడీపీ హాల్లో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ శాఖ పరిపాలన అధికారి కేవీఎస్ రాజేశ్వరి ఉద్యోగ విరమణ సత్కార సభ నిర్వహించారు. అమరావతి కమిషనర్ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రమీల, వ్యవసాయ శాఖ జేడీ పాష, జూడీ-2 వెంకటేశ్వరరావు, అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కమలాకర్ శర్మ, ఏలూరు, భీమవరం, వ్యవసాయ శాఖ అధికారులు రాజేశ్వరి దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

● ఏలూరు రూరల్ : ఏలూరు మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయుడిగా పని చేసిన కటారి రామ్మూర్తి ఉద్యోగ విరమణ సత్కార సభ నిర్వహించారు. రామ్మూర్తి దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఏలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు భాస్కర్‌రావు, హజరత్, నగర ప్రముఖులు ఎన్.రామారావు, అల్లూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్ : డిప్యూటీ కలెక్టర్ హోదాలో సమగ్రశిక్ష జిల్లా ఏపీసీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బి.సోమశేఖర్‌ను ఏలూరులో కాపు సంక్షేమ సంఘం నాయకులు సత్కరించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు, సంఘ నాయకులు పూజారి నిరంజన్, మోటేపల్లి చంద్రశేఖర్, సామర్ల వెంకటేశ్వరరావు, గునిశెట్టి రాజేష్, విఠాల శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : జడ్పీ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాజేంద్రప్రసాద్‌ను జడ్పీ కార్యాలయంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు కందుకూరి ఈశ్వరరావు బృందం సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, తదితరులు ఉన్నారు.

● చింతలపూడి : సబ్ జైల్ సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు పదవీ విరమణ సత్కార సభ సబ్ జైల్ ఆవరణలో జరిగింది. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జ్ సి.మధుబాబు, జిల్లా సబ్‌జైల్ అధికారి అప్పలనాయుడు, నూతన సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : నాచుగుంట నెం-2 పాఠశాల హెచ్‌ఎం ముప్పన వెంకటేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ముప్పన వెంకటేశ్వరరావు, సతీమణి రాధ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈవో కాంద్రేగుల శ్రీనివాసరావు విద్యా కమిటీ చైర్మెన్ ప్రమీల, ఎంపీటీసీ, మండల యూటీఎఫ్ నాయకులు ఉనుముల రాంబాబు, జోగినాయుడు, శీతాల సత్యనారాయణ, పుప్పాల నరసింహారావు, అల్లు శ్రీను, బొమ్మిడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పాఠశాలకు గుర్తింపు రద్దు

కామవరపుకోట, జూన్ 30 : ఎటువంటి వసతులు లేకుండా నిర్వహిస్తున్న విశ్వతేజ పాఠశాలకు గుర్తింపు రద్దు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలకు సంబంధించిన కట్టడాలకు సరైన పత్రాలు లేవని, ఆట స్థలం లీజు డీడీలో ఉందని, ఫైర్ సర్టిఫికెట్, ల్యాండ్ కన్వర్షన్ డాక్యుమెంట్, పంచాయతీ ఎన్‌ఓసి లేదని చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని, విశ్వతేజ పాఠశాలలో చేర్పిస్తే టీసీలు పొందేందుకు ఇబ్బందులు పడతారని ముందస్తుగానే తెలియజేస్తున్నామని డీఈ తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పాఠశాలలో విద్యార్థులను చేర్పవద్దని కోరారు.

సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 30 : ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో నిరుపేద, పేద ఓసీలకు వర్తింప చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఓసీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ పంచాది రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా, రూ.ఎనిమిది లక్షల కుటుంబ వార్షికాదాయం అనే ఏకైక సూచనను మాత్రమే పరిగణనలోకి తీసుకుని ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిందన్నారు. దీంతో అర్థమే మారిపోయి రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతిందని విమర్శించారు. ఓసీల చట్ట బద్ధమైన హక్కులను వైసీపీ ప్రభుత్వం హరించేయడం వల్ల ఓసీలు ఉద్యోగాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక పింఛన్ల పథకాన్ని నిరుపేద, పేద ఓసీలకు కూడా 50 సంవత్సరాల వయస్సు నుంచే వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు ఇస్తున్న అన్ని రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలన్నారు. పేదరికమే ప్రామాణికంగా ఓసీలకు కూడా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప జేయాలని అన్నారు.

పౌష్టికాహారంతో గుండె జబ్బులు దూరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్

ఏలూరు రూరల్, జూన్ 30: పౌష్టికాహారం తీసుకుంటే గుండె జబ్బులు నివారించవచ్చని, గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక చొదిమెళ్ళ గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఆదివారం ఏలూరు లయన్స్ క్లబ్, పీఎస్ఆర్ రియల్‌ఎస్టేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండెవ్యాధుల పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించారు. ఉచితంగా ఈసీజీ, 2డీఎకో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నడక, ఆహార నియమాలు, పౌష్టికాహారంతో గుండెవ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడియం ప్రసాద్‌బాబు, కార్యదర్శి ఎం.చలపతిరావు, కోశాధికారి తవ్వా రాజా, టి.లక్ష్మీనారాయణ, హేమా కోటేశ్వరరావు, పీవీకే మోహన్‌రావు, గ్రంధి రాము, తవ్వా కిషోర్, వి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల పూజలు



గ్రామంలో పూజలు చేస్తున్న కూటమి నాయకులు


చింతలపూడి, జూన్ 30: టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, ఆసుపత్రి నుంచి క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటూ చింతలపూడి మండలం యండపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కొద్ది రోజులుగా ఆయన అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. గుత్తా సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సాల్మన్, కె.నాగబాబు, మాజీ సర్పంచ్ దొడ్డా రాజశేఖర్, తాడిపర్తి సత్యనారాయణ, పలువురు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

చాట్రాయి, జూన్ 30: భగవాన్ శ్రీసత్యసాయి ట్రస్ట్, నూజివీడు అమెరికన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జూలై ఎనిమిదో తేదీన విస్సన్నపేటలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేత్ర వైద్య నిపుణుడు జెమ్షద్ షాహిన్ పరీక్షలు నిర్వహించి, శుక్లాలు ఉన్నవారికి నూజివీడు అమెరికన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారు శిబిరానికి వచ్చేటప్పుడు తల స్నానం చేసి, వెంట ఆధార్ కార్డు, దుప్పటి, ప్లేటు గ్లాసు, జత బట్టలు తెచ్చుకోవాలన్నారు. చుట్టు పక్కల మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీపై ఆక్వా యూనిట్లు

కలిదిండి, జూన్ 30 : సబ్సిడీ యూనిట్స్‌ను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఫిషరీస్ ఏడీ చాంద్‌బాషా ప్రకటనలో కోరారు. ఆక్వా రైతులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లటానికి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఓసీ, బీసీలకు 40 శాతం సబ్సిడీపై పలు యూనిట్లు అందిస్తున్నామన్నారు. మంచినీటి చేపల హేచరీ ఏర్పాటుకు రూ. 25 లక్షలు, బయో ఫ్లాక్ పాండ్స్ ఏర్పాటుకు రూ.14 లక్షలు, రీ సర్క్యులేటరీ - ఆక్వా కల్చర్ సిస్టమ్ ఏర్పాటుకు రూ.50 లక్షలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ డిసీస్ డయాగ్నసిస్ అండ్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.25 లక్షలు, మొబైల్ ఆక్వా ల్యాబ్‌కు రూ.35 లక్షలు, ప్రి ప్రోసెసింగ్ యూనిట్‌కు రూ.6.3 కోట్లు, ప్రోసెసింగ్ యూనిట్‌కు రూ.40 కోట్లు, ఎస్టాబ్లిషింగ్ న్యూ ఫ్రెష్ వాటర్ స్కాంపి హేచరీకి రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ న్యూ గ్రో అవుట్ పాండ్‌కి రూ.ఏడు లక్షలు, రీ సర్క్యులేటరీ - ఆక్వా కల్చర్ సిస్టమ్‌కి రూ. ఇరవై ఐదు లక్షలు, ఫ్రెష్ వాటర్ ఆర్నమెంటల్ ఫిష్ ఇంటిగ్రేడ్ బ్రీడింగ్ అండ్ రేరింగ్‌కి రూ.25 లక్షలు, ఫ్రెష్ వాటర్ ఆర్నమెంటల్ ఫిష్ బ్రూడ్ బ్యాంక్ ఏర్పాటుకు కోటి రూపాయలు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు 10 టన్నులకి రూ.40 లక్షలు, 20 టన్నులకు రూ.80 లక్షలు, 30 టన్నులకు రూ.1.2 కోట్లు, 50 టన్నులకు రూ.1.5 కోట్లు, ఫిష్ వాల్యూయాడెడ్ యూనిట్ ఏర్పాటుకి రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫిష్ కియోస్కి, అక్వేరియం ఏర్పాటుకు రూ.10 లక్షలు సబ్సిడీపై యూనిట్స్ మంజూరు చేస్తామన్నారు. వివరాలకు కైకలూరు మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.



ప్రస్తుతం ఇరువైపులా కార్యాలయాలు, పాదుకా మండపంతో ప్రధాన రాజగోపురం మెట్ల దారి

ద్వారకాతిరుమల, జూన్ 30: దాదాపు 110 సంవత్సరాల క్రితం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన రాజగోపురం ఈవిధంగా ఉంది. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శతాబ్దాల నాటి చరిత్ర కల్గిన క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పేరు గాంచింది. 1914లో ఉన్న ఆలయ దక్షిణ గోపురానికి ఇప్పటి గోపురానికి మధ్య చాలా అభివృద్ధి కన్పించింది. గతంలో ఆలయ గోపురాల పక్కన కొండలు, వృక్షాలతో ఉండేదని కాలక్రమేణా వచ్చిన అధికారులు పరిసరాలను అభివృద్ధి చేశారు. గతంలో తూర్పుగోపురం పక్కన అంతా కొండతోనూ చెట్లతో చిట్టడవిని తలపించేదిట. అప్పటి ఈవో ఎంఎస్‌రావు దానిని తొలగింపజేసి దారిని ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం భక్తులకు సౌకర్యంగా ఉంది. ప్రధాన రాజగోపుర మెట్ల దారి సైతం ప్రస్తుతం ఇరువైపులా ఆలయ కార్యాలయం, పద్మావతి, ఆండాళ్ సదనాలను నిర్మించారు. మెట్లకు ఇరువైపులా దశావతార చరిత్రతో విగ్రహాలు, మెట్ల దిగువన పాదుకా మండపాన్ని సైతం నిర్మించారు.

సబ్సిడీపై ఆక్వా యూనిట్లు



కలిదిండి, జూన్ 30 : సబ్సిడీ యూనిట్స్‌ను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఫిషరీస్ ఏడీ చాంద్‌బాషా ప్రకటనలో కోరారు. ఆక్వా రైతులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లటానికి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఓసీ, బీసీలకు 40 శాతం సబ్సిడీపై పలు యూనిట్లు అందిస్తున్నామన్నారు. మంచినీటి చేపల హేచరీ ఏర్పాటుకు రూ. 25 లక్షలు, బయో ఫ్లాక్ పాండ్స్ ఏర్పాటుకు రూ.14 లక్షలు రీ సర్క్యులేటరీ - ఆక్వా కల్చర్ సిస్టమ్ ఏర్పాటుకు రూ.50 లక్షలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ డిసీస్ డయాగ్నసిస్ అండ్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.25 లక్షలు, మొబైల్ ఆక్వా ల్యాబ్‌కు రూ.35 లక్షలు, ప్రి ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.6.3 కోట్లు, ప్రోసెసింగ్ యూనిట్‌కు రూ.40 కోట్లు, ఎస్టాబ్లిషింగ్ న్యూ ఫ్రెష్ వాటర్ స్కాంపి హేచరీకి రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ న్యూ గ్రో అవుట్ పాండ్‌కి రూ.7 లక్షలు, రీ సర్క్యులేటరీ - ఆక్వా కల్చర్ సిస్టమ్‌కి రూ.25 లక్షలు, ఫ్రెష్ వాటర్ ఆర్నమెంటల్ ఫిష్ ఇంటిగ్రేడ్ బ్రీడింగ్ అండ్ రేరింగ్‌కి రూ.25 లక్షలు, ఫ్రెష్ వాటర్ ఆర్నమెంటల్ ఫిష్ బ్రూడ్ బ్యాంక్ ఏర్పాటుకు కోటి రూపాయలు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు 10 టన్నులకి రూ.40 లక్షలు, 20 టన్నులకు రూ.80 లక్షలు, 30 టన్నులకు రూ.1.2 కోట్లు, 50 టన్నులకు రూ.1.5 కోట్లు, ఫిష్ వాల్యూయాడెడ్ యూనిట్ ఏర్పాటుకి రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫిష్ కియోస్కి. అక్వేరియం ఏర్పాటుకు రూ.10 లక్షలు సబ్సిడీపై యూనిట్స్ మంజూరు చేస్తామన్నారు. వివరాలకు కైకలూరు మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.



కనువిందు..

మండలంలో పోతుమర్రు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు పసుపు రంగు పూలతో విరబూసి ప్రజలను ఆకట్టుకుంటోంది. ఆకులు కూడా కనపడకుండా పూలు విరబూసి కనువిందు చేస్తోంది. యువత ఇక్కడ సెల్ఫీలు దిగుతోంది.

-కలిదిండి

నేడు పింఛన్ల పండుగ

పంపిణీకి సర్వం సిద్ధం

కైకలూరు, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి పూర్తిస్థాయి ఏర్పాట్లు నిర్వహించామని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి రూ.7వేలు అందజేస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.వెయ్యి చొప్పున పెంచిన సొమ్ముతో కలుపుకొని ఈ నెల పింఛను రూ.4వేలు మొత్తం రూ.7వేలు అందజేయడం జరుగుతుందన్నారు. కైకలూరు మండలంలో 9582 మంది లబ్ధిదారులున్నారని వీరికి 6 కోట్ల 53 లక్షల 19 వేల 500 రూపాయలు పంపిణీ చేస్తామన్నారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులందరూ కలిసికట్టుగా పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లకు ప్రభుత్వం తెచ్చిన నూతన విధానాన్ని వివరించాల న్నారు. హామీలకు కట్టుబడి భారీఎత్తున పంపిణీ నిర్వహిస్తున్నా మన్నారు. మొదటిరోజే నూరు శాతం పంపిణీ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు త్రినాథరాజు తెలిపారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఈవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఆదివారం ఆమె పెన్షన్‌ల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 7990 పెన్షన్లు ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వ హయాంలో గత జూన్ నెలలో రూ. 2,36,17,500 పెన్షన్ నగదు ఇచ్చారని, అయితే నూతన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్‌తో కలిపి జూలై నెలలో రూ. 5 కోట్ల 41 లక్షల 52 వేల లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కన్నా నూతన కూటమి ప్రభుత్వంలో రూ 3,05,45,000లు అదనంగా పెన్షన్‌దారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సోమవారం పెన్షన్ల పంపిణీకి 160 మందిని ఏర్పాటు చేశామని వీరిలో సచివాలయ ఉద్యోగులు 99 మంది, అంగన్ వాడీలు 42 మంది, వీఆర్వోలు 16 మంది, వెలుగు సీసీలు ఇద్దరు, ఎంఈవో కార్యాలయం నుంచి ఒకరికి బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఎన్వీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సాయిరాము తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ముసునూరు ఎంపీడీవో పద్మావతిదేవి

ముదినేపల్లి: పెన్షన్ల పంపిణీకి అధికారులతోపాటు కూటమి రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు సోమవారం జరగనున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు వారి స్వగ్రామాలతోపాటు పలు గ్రామాల్లో జరిగే పెన్షన్ల పంపిణీకి హాజరవ్వాలని నిర్ణయించారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం తొలిసారిగా జరుగుతున్న ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని మండల కూటమి నాయకులు నిర్ణయించారు. పెన్షన్ల పెంపు వల్ల పేదలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

దీర్ఘకాలిక సమస్య పరిష్కారం

మంత్రి సారథికి బీసీ కాలనీ వాసుల కృతజ్ఞతలు



లోపూడి బీసీ కాలనీలో తూరలు వేయిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, జూన్ 30: మండలంలోని లోపూడి బీసీ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న సమస్య మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ కాలనీ నుంచి పక్కన ఉన్న పెద్ద చెరువులోకి వర్షపునీరు వెళ్ళేలా సిమెంట్ తూరలను టీడీపీ నాయకులు, ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు, యువ నాయకుడు చలమాల మల్లేశ్వరరావులు మాట్లాడుతూ వర్షాకాలంలో బీసీ కాలనీ ముంపునకు గురవుతోందని, వర్షపునీరు వెళ్ళేలా తూరలు వేయాలని ఐదేళ్ళుగా గత ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు కాలనీవాసులు ఆర్జీలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో బీసీ కాలనీకి వచ్చిన పార్థసారథికి సమస్య వివరించగా ఎంత ఖర్చు అయినా తూరలు వేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు మంత్రి రూ.1,00,000ల విలువగల సిమెంట్ తూరలను పంపారని, వీటిని ఆర్‌అండ్‌బీ అధికారుల సమక్షంలో బీసీ కాలనీలో వర్షపునీరు పెద్దచెరువులోకి వెళ్ళేలా తూరలు వేయడం జరిగిందన్నారు. దీంతో మంత్రి పార్థసారథికి బీసీ కాలనీ వాసులు, స్థానిక టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పేరం గంగరాజు, శెట్టిపల్లి నూతన్, డోలా రాంబాబు, నక్కా చెన్నారావు, సూరగాని రాంబాబు, పంజుగల వెంకయ్య, చలమాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కామినేని చొరవతో నీటిపారుదలకు చర్యలు



కైకలూరు, జూన్ 30: గత ప్రభుత్వ హయంలో రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో రహదారులపై ప్రయాణించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గరవుతున్నారు. కైకలూరు మండలం ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో నివాసగృహాల వద్ద రహదారి అధ్వానంగా ఉండడంతో వర్షాలకు నీరు చేరి వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెడంతో ఆయన ఆదేశాల మేరకు జనసేన నాయకులు రహదారిపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. కూలీలతో గుంతలు తవ్వించి నీరు పారేలా చర్యలు చేపట్టారు. జనసేన నాయకులు అద్దంకి రమేష్‌రాజు, తోట లక్ష్మి, కొల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పనులను నిర్వహించారు.



కోటపాడు వద్ద ప్రమాదకరంగా తమ్మిలేరును దాటుతున్న రైతులు

ప్రాణాలకు తెగించి..

- కోటపాడు వద్ద తమ్మిలేరుపై బ్రిడ్జి లేక ప్రజల అవస్థలు
- వర్షాకాలం కావడంతో ప్రమాదాల భయం
- కొత్త ప్రభుత్వమైనా కనికరించాలని ప్రజల విజ్ఞప్తి

చాట్రాయి, జూన్ 30: మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు గ్రామాల మధ్య తమ్మిలేరుపై బ్రిడ్జి లేక ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోటపాడు రైతులకు పోతునూరులో, ఆ గ్రామ రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయి. అలాగే కోటపాడు, చీపురుగూడెం తదితర గ్రామాల ప్రజలు వైద్యం, ఇతర పనులకు నిత్యం చింతలపూడి, సత్తుపల్లి పట్టణాలకు వెళుతుంటారు. అంతేకాక ఈ గ్రామాల విద్యార్థులు చింతలపూడి, సత్తుపల్లిలోని కాలేజీల్లో చదువుతూ నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కారణాల వలన ప్రతి రోజు కోటపాడు వద్ద అధిక సంఖ్యలో ప్రజలు తమ్మిలేరును దాటుతూ ఉంటారు. వర్షాకాలంలో తమ్మిలేరును దాటటం ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్ళ క్రితం ఓ వ్యక్తి తమ్మిలేరు దాటుతూ కొట్టుకుపోయి మృతి చెందాడు. ప్రతి ఏటా పశువులు నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నాయి. 30 ఏళ్ళ నుంచి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నా ఫలితం కలగలేదు. 8 ఏళ్ళ క్రితం అప్పటి ఎంపీటీసీ బూబత్తుల మాధవి ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.50 కోట్లతో అంచనాలు తయారు చేయించి, నాటి ఏలూరు ఎంపీ మాగంటి బాబుతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు మంజూరు కాలేదు. గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ స్పందించి కోటపాడు వద్ద తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులివ్వించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యానికి మానవత చేయూత



కైకలూరు, జూన్ 30: వైద్యం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కొండ్రెడ్డి చిట్టెమ్మ రూ.17 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం కైకలూరు శ్రీరామకృష్ణ సేవా సమితిలో కలిదిండి గ్రామానికి చెందిన శివభరత్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సొమ్మును చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ సంస్థ ద్వారా పేదలకు విద్య వైద్యపరంగా అనేక సౌకర్యాలను అందజేస్తామన్నారు. సంస్థ మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, సభ్యులు మాడెం సత్యనారాయణ, పి. పవన్‌కాంత్, ఎండీ బాబు, శీలం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌కు లక్ష్మీరాణి అభినందన



కైకలూరు, జూన్ 30: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏలూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అభినందించారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్ల అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆయన సూచించినట్లు లక్ష్మీరాణి తెలిపారు.

వాన పాట్లు

డ్రైనేజీలు సరి లేక రహదారుల పైకే నీరు.. మండవల్లి పాఠశాలలో నీరు చేరి ఇబ్బందులు



చీపురుగూడెం మేకల బజారులో నిలిచిన వర్షం నీరు

చాట్రాయి, జూన్ 30: మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి చీపురుగూడెంలో డ్రెయిన్లు లేక రహదారులపై వర్షపునీరు నిలిచి ప్రజలు నరకయాతన అనుభవించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ పరిస్థితి వస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ బజారు, మేకల బజారులలో రహదారులపై వర్షంనీరు నిలిచిపోవటంతో బురదకయ్యగా మారి అపరిశుభ్రత తాండవించటంతో పాటు వాహనాల తాకిడికి రహదారులు గోతులమయంగా మారుతున్నాయని, దోమలు ఈగలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కచ్చా డ్రెయిన్లు తీయించి వర్షపునీరు నివాస ప్రాంతాల్లో నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలోకి చేరిన వాన నీరు

మండవల్లి, జూన్ 30: మండవల్లి ప్రాథమిక పాఠశాల-1 ఆవరణలో వర్షం నీరు చేరింది. దీంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారింది. పాఠశాల ఆవరణలో మెరక పనులు చేసినప్పుడు రెండు బిల్డింగులు వెనుక పూడిక చేయక పల్లంగా ఉండడంతో వర్షాలకు పాఠశాల ఆవరణలోకి నీరు చేరి సమస్య ఏర్పడుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. వర్షం కురిసినప్పుడు ఈ పల్లం ప్రదేశం లోనికి నీరు చేరి రోజుల తరబడి నిలబడి ఉండటం వలన భవనాలు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు వ్యక్తం చేశారు. పాములు కూడా తిరుగుతున్నట్లు గతంలో ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని భాస్కరరావు కోరారు.

పనుల నిర్వహణలో నిర్లక్ష్యం.. దిగబడిన లారీ

మండవల్లి, జూన్ 30: మండవల్లిలోని వెలంపేట వద్ద తణుకు నుంచి సింగరాయపాలెం మిల్లుకు ధాన్యం లోడుతో వెళుతున్న లారీ ఆదివారం సాయంత్రం తిరగబడింది. 165 జాతీయ రహదారి మరమ్మతుల్లో భాగంగా మండవల్లిలోని వెలంపేటలో కైకలూరు సందు వద్ద డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన రోడ్డును తూరలు వేసి మట్టితో పూడ్చివేశారు. పకడ్బందీగా నిర్మాణం జరగకపోవడంతో లారీ ఆ మట్టిలో దిగబడిపోయింది. వేసవిలో చేయాల్సిన పనులను వర్షాకాలంలో అస్తవ్యస్తంగా చేపట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పనులు ప్రారంభించి రెండేళ్ల పైగా అయినప్పటికీ మండవల్లిలో పూర్తి చేయకపోవడం చాలా దారుణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మొత్తం బురదగా మారి దుర్వాసన వ్యాపిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. పలు ద్విచక్ర వాహనాలు పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. వర్షాకాలం రాకముందే డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని పలుమార్లు అధికారులను గ్రామస్థులు కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆరోపిస్తున్నారు. డ్రైన్ నీరు, వర్షపునీరు రోడ్డుపై నిలబడి దుర్వాసన వ్యాపిస్తోందని, వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, పనులు వేగవంతం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు కోరారు.



అధికారుల తప్పిదం : మండవల్లి వద్ద పక్కకు ఒరిగిన ధాన్యం లారీ

254 మిల్లీ మీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, జూన్ 30: గత 24 గంటల్లో నూజివీడు డివిజన్ వ్యాప్తంగా 254 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సరాసరి వర్షపాతం 42.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా నూజివీడులో 48.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా లింగపాలెంలో 31.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముసునూరులో 48, చింతలపూడిలో 47.6, ఆగిరిపల్లిలో 40.2, చాట్రాయిలో 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



చలసాని అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

అశోక్‌కుమార్ సేవలు అభినందనీయం

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, జూన్ 30: పంచాయతీరాజ్ శాఖలో 33 ఏళ్ల వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన చలసాని అశోక్‌కుమార్ సేవలు అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం భట్ల పెనుమర్రులోని పింగళి వెంకయ్య భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నాయకుడిగా అశోక్ కుమార్ సమర్థవంతంగా పనిచేశారన్నారు. అశోక్ కుమార్‌ను సత్కరించి మెమెంటో అందించి అభినందించారు. కళ్లేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్, ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నేతలు జె.ఎల్.ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర, ఉభయ కృష్ణా జిల్లాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని అశోక్ కుమార్ దంపతులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.

ఆదర్శ డ్రైవర్ రాంబాబుకు సన్మానం



ముదినేపల్లి, జూన్ 30 : ఆర్టీసీ గుడివాడ డిపోలో 33 సంవత్సరాల పాటు డ్రైవర్‌గా పని చేసి అవార్డులు అందుకుని ఆదివారం రిటైరైన ముదినేపల్లికి చెందిన బెజవాడ రాంబాబును డిపో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రాంబాబును డిపో సీఐ సత్యనారాయణ సత్కరించి మాట్లాడుతూ రాంబాబు డ్రైవర్లకు ఆదర్శంగా నిలిచారన్నారు. డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, మజ్దూర్ యూనియన్ కార్యదర్శి మదన్ కుమార్, ఇతర సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నూజివీడులో మెగా వైద్య శిబిరం



నూజివీడు టౌన్, జూన్ 30: హృద్రోగులను గుర్తించి తగు వైద్య సహాయాన్ని అందించటం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు అన్నారు. నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీలో విజయవాడ పీవీఆర్ హాస్పిటల్స్ సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుంటూ తగు చికిత్స పొందాలన్నారు. పీవీఆర్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ విజయ్, డాక్టర్ రఘుపతిరావు, డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ లక్ష్మీ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఈసీజీ ఎకో టెస్టులను నిర్వహించి 200మంది రోగులను పరీక్షించి మందులను అందించారు. రాష్ట్ర బీసీ సెల్ నాయకులు తలపంటి రాజశేఖర్, టీడీపీ మహిళా నాయకులు నజీమ తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

చాట్రాయి, జూన్ 30: భగవాన్ శ్రీసత్యసాయి ట్రస్ట్, నూజివీడు అమెరికన్ హాస్పటల్ ఆధ్వర్యంలో జూలై 8న విస్సన్నపేటలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ అధ్యక్షుడు జె. రంగారెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంటి వైద్య నిపుణుడు జెమృధ్ షాహిన్, సిబ్బంది పరీక్షలు నిర్వహించి, శుక్లాలు ఉన్నవారికి నూజివీడు అమెరికన్ హాస్పటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయించటం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్లకు అర్హులైన వారు శిబిరానికి వచ్చేటప్పుడు తలస్నానం చేసి, వెంట ఆధార్ కార్డు, దుప్పటి, ప్లేటు, గ్లాసు, జత బట్టలు తెచ్చుకోవాలన్నారు. చుట్టు పక్కల మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

మత్తు సేవనంతో ముప్పే

నూజివీడు టౌన్, జూన్ 30: మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై నూజివీడు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాసా సెంటర్, బీఆర్ అంబేడ్కర్ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో కళాజాతా ద్వారా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజరు జక్కుల ఆంజనేయులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలుగా మారిన వారి వివరాలను 94904 92020 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. జానపద కళాకారులు శ్రీనివాస్, రాధాకృష్ణ తమ కళాజాతతో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలభవన్ సిబ్బంది జి.వాణి, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణం

ముదినేపల్లి, జూన్ 30 : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం జూలై 2న జరుగుతుందని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రమైన కృత్తిక నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించనున్నారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు నిర్ణీత రుసుము చెల్లించి కల్యాణంలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

ఘనంగా సీత్లా పండుగ



చాట్రాయి, జూన్ 30: మండలంలోని పోతనపల్లి పెద్ద తండాలో లంబాడాలు ఆదివారం సీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు సమృద్ధిగా కలగాలని, పశు సంపద, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రతి ఏటా లంబాడాలు గ్రామ దేవతకు మొక్కులు చెల్లించి పూజలు చేస్తారు. ఈ మేరకు లంబాడాలు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ దేవతకు వద్దకు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు స్థానిక నాయకులు పూజల్లో పాల్గొన్నారు.